క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ పోటీల్లో బాలికల జట్టు ప్రతిభ



ఏటూరునాగారం : ములుగు జిల్లాస్థాయి సీఎం కప్ హ్యాండ్‌బాల్ పోటీలు జాకారంలో నిర్వహించగా ఏటూరునాగారానికి చెందిన బాలికల జట్టు ప్రథమ బహుమతి గెలుచుకుందని స్పోర్ట్స్ క్లబ్ కోచ్ పర్వతాల కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో గెలుపొందిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఏటూరునాగారం బాలుర జట్టు ద్వితీయ బహుమతి గెలుపొందిందని తెలిపారు.

కొనసాగుతున్న ఇళ్ల సర్వే



వాజేడు : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఈ సర్వే నడుస్తుండగా సర్వే జరుగుతున్న తీరును ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు బుధవారం పరిశీలించారు. కాగా ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను సెల్‌ఫోన్ యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఇంటి ఫొటో, స్థలం వివరాలు, యజమాని ఫొటోను సెల్‌ఫోన్‌లో యాప్‌లో పొందుపరిచారు. మండల వ్యాప్తంగా 8,158 కుటుంబాల వారు ఇళ్లకోసం దరఖాస్తులు చేసుకోగా ఆ వివరాల ప్రకారం సర్వేను పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది చేస్తున్నారు.

గణిత ఒలింపియాడ్‌లో విద్యార్థిని ప్రతిభ



కారుణ్య

గోవిందరావుపేట : ములుగు జిల్లాలో జరిగిన గణిత ఒలింపియాడ్‌లో చల్వాయి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. మండల కేంద్రంలోని బాలుర జెడ్పీఎస్ఎస్‌లో బుధవారం నిర్వహించిన గణిత ఒలింపియాడ్‌లో 10వ తరగతి చదువుతున్న డి.కారుణ్య ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో 3వ స్థానాన్ని సాధించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి మాట్లాడుతూ మా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కారుణ్య గణిత ఒలింపియాడ్‌లో జిల్లాలో 3వ స్థానం సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చింది అని అన్నారు. విద్యార్థిని కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల ప్రోత్సాహం విద్యార్థి విజయానికి కారణమయ్యాయన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పరామర్శ



కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెంకు చెందిన జనగం సత్యం ఇటీవల మృతి చెందగా మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ మండల ఇన్‌చార్జ్ రాంబాబు ఆధ్వర్యంలో పరామర్శించారు. నాయకులు సత్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఓదార్చి వారికి బియ్యం, వంట సరుకులు అందించారు. సత్యం కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని రాంబాబు హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి దుర్గం బైరేష్ ,గ్రామ శాఖ అధ్యక్షుడు సునార్కని శ్రీరాములు, సుమన్, మండల సీనియర్ నాయకులు సమ్మయ్య, ఆనందరావు, గణపతి, సమ్మయ్య, నాగేష్, మోహన్, జలేందర్, సంతోష్ తదితరులు ఉన్నారు.

హమాలీ కార్మికుల అక్రమ అరెస్టు సరికాదు



ములుగు రూరల్ : సివిల్ సప్లై హమాలీ కార్మికులు లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు పెంచాలని డిమాండ్ మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమానికి హాజరు కాకుండా కార్మికులను అరెస్టు చేయడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ముత్యాల రాజు అన్నారు. బుధవారం హమాలీ కార్మికులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి ఒకసారి పెంచాల్సిన హమాలీ చార్జీలను నాలుగేళ్లుగా పెంచక పోవడంతో శాంతియుతంగా ధర్నా చేపట్టేందుకు వెళ్తున్న కార్మికులను అరెస్టు చేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వం హమాలీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాంబాబు, రమేశ్, రవి, కుమార్, నరేష్, సుమన్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

పొగమంచుతో అధిక ప్రమాదాలు

- రాత్రి పూట ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి
- జైపాల్‌రెడ్డి, సీనియర్ ఎంవీఐ, వరంగల్ ఆర్టీఏ





ఖిలా వరంగల్: ప్రస్తుతం విపరీతమైన చలితోపాటు పొగ మంచు కురుస్తోంది. రహదారులను కమ్మేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫాగ్ లైట్లు వాడితే 25మీటర్ల వరకు స్పష్టంగా చూడొచ్చు. నాలుగు చక్రాల వాహనం ఒకే లైటుతో ప్రయాణిస్తే ఎదురుగా వచ్చే వారు ద్విచక్ర వాహనమనుకుని, పక్కనుంచే వెళ్లే అవకాశం ఉంది. రెండు హెడ్‌లైట్లు డిప్ చేస్తూ ప్రయాణించాలి. మూలమలుపుల వద్ద అతివేగం పనికి రాదు. వాహనాలను ఓవర్‌టేక్ చేయడం వల్ల ఎదురుగా వచ్చేవి కనిపించవు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వెనుక లైట్లు వెలిగేలా చూసుకోవాలి. పొగ మంచులో కాంతి పరావర్తనం చెంది ఎదురు వాహనాలు కనిపించవు. వాహనానికి ముందు, వెనుక రేడియం స్టిక్కర్లు అతికించాలి. రహదారిని చూడగలిగే పరిస్థితులకు అనుగుణంగా వాహన వేగం ఉండాలి. ఇతర వాహనదారులు తమను గమనించేలా హజార్డ్ లైట్ వాడాలి. లోబీమ్ ఫాగ్ లైట్లు ఉండేలా చూడాలి. నేషనల్ హైవే, శివారు రహదారులపై వాహనాల మధ్య కచ్చితంగా దూరం పాటించాలి.

చిప్‌లు గట్టిపడి పనితనం మందగిస్తుంది

- మంచుకురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ ఉపయోగించొద్దు
- మయూర్, ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్, హనుమకొండ



హన్మకొండ చౌరస్తా: ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలలో పడిపోయినప్పుడు కంప్యూటర్లు, మొబైళ్లు, బ్యాటరీ, ప్రోగ్రామబుల్ లాజిక్ కంట్రోలర్లలో ఉండే మెటల్ కాంట్రాక్ట్‌లు ప్రభావితం అవుతాయి. ఎలక్ట్రానిక్స్ వస్తువుల లోపల ఉండే చిప్‌లు మైనస్ టెంపరేచర్‌లో గట్టిపడి పనితనం మందగిస్తుంది. అయితే బయటి దేశాలతో పోల్చితే ముఖ్యంగా తెలంగాణ ప్రాంతాల్లోని చలితీవ్రత చాలా తక్కువగా ఉంటుందని చెప్పొచ్చు. దీని వల్ల ఎలక్ట్రానిక్స్ వస్తువులపై అంతగా ప్రభావం ఉండదు. అలాగని మంచు కురిసే సమయంలో బయటి ప్రదేశాల్లో ల్యాప్‌టాప్, మొబైళ్లను వాడితే తెలియకుండానే మంచు లోపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. నీటి తడితో విడిభాగాలు పూర్తిగా పాడవుతాయి. మంచు కురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం మంచిది. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు కంప్యూటర్లు, మొబైళ్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువుల విడి భాగాలపైన కొంత ప్రభావం చూపుతుంది తప్పితే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌పై ఎలాంటి ప్రభావం ఉండదు. కీప్యాడ్ మొబైళ్లు కొంత బిగుసుకుపోయే అవకాశం ఉంటుంది. ఇప్పుడంతా స్మార్ట్ ప్రపంచం. మొబైల్ బాగా వేడి అయినప్పుడు స్విచ్ఆఫ్ చేయడం మంచిది.

జీపీఎస్‌లపై పర్యవేక్షణ కరువు

- మోడల్ స్కూళ్లలో కొరవడిన వసతులు
- ఒకే గదిలో ఐదు తరగతుల నిర్వహణ
- స్కావెంజర్ల నియామకంపై దృష్టి సారించని అధికారులు



ఒకే తరగతి గదిలో ఐదు తరగతులకు చెందిన విద్యార్థులు

మంగపేట : మండలంలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల(జీపీఎస్)ల నిర్వహణపై సంబంధిత ఐటీడీఏ విద్యావిభాగం అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో అనేక సమస్యలకు నిలయంగా మారాయి. మండలంలో 21 జీపీ పాఠశాలలు ఉండగా చుంచుపల్లిలోని గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆదర్శ(మోడల్) పాఠశాలగా 2018లో ఎంపిక చేశారు. గిరిజన విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియం బోధన అందించేందుకు పాఠశాలను ఎంపిక చేశారే తప్ప ఆరేళ్లు పూర్తవుతున్నా ఇప్పటి వరకు పాఠశాలలో అదనపు తరగతుల గదుల ఏర్పాటు చేయలేదు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 39 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉండగా పాఠశాలలో ఒకే గదిలో ఐదు తరగతులు కొనసాగడం గమనార్హం.

అన్ని పాఠశాలల్లో ఇదే తీరు..

మండలంలోని జీపీ పాఠశాలల్లో ఎక్కడ చూసినా ఇదే తీరు కనిపిస్తోంది. ఆదర్శ పాఠశాలలోనే అదనపు తరగతి గదుల సమస్యను పట్టించుకోక పోవడం చూస్తుంటే ఏజెన్సీలోని జీపీఎస్ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పాఠశాలల భవనాలపై పర్యవేక్షణ, మరుగుదొడ్లు, మూత్రశాలల ఏర్పాటు, తాగునీటి వసతి, ప్రహరీ తదితర సదుపాయాల కల్పనపై ఐటీడీఏ విద్యావిభాగానికి చెందిన ఉన్నతాధికారులు పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో లేక పోవడంతో అరకొర వసతుల మధ్య పాఠశాలల నిర్వహణ కొనసాగుతోంది. ప్రధానంగా 30 ఏళ్ల క్రితం నిర్మించిన పలు పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 10కి పైగా పాఠశాలలకు సరిపడా తరగతి గదులు లేక పోవడంతో ఒకే గదిలో విద్యాబోధన కొనసాగడం ఆశ్చర్యకరం.



చుంచుపల్లిలోని జీపీఎస్ మోడల్ పాఠశాల

విద్యాబోధన కష్టతరంగా ఉంది



పాఠశాలకు వరండాతో పాటు ఒక తరగతి మాత్రమే ఉంది. అందులోనే ఐదు తరగతులకు చెందిన 39 మంది విద్యార్థులకు విద్యాబోధన చేయడం చాలా ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి మోడల్ పాఠశాల నిర్వహణకు అదనపు తరగతి గదులు నిర్మించాలి.

– చింత కృష్ణమూర్తి, హెచ్ఎం, గిరిజన ప్రాథమిక మోడల్ పాఠశాల, చుంచుపల్లి

ఆర్ఓఆర్ బిల్లును ఉపసంహరించుకోవాలి

- ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సిమూర్తి



మాట్లాడుతున్న నర్సింహమూర్తి

వెంకటాపురం(కె): ఆర్ఓఆర్ చట్టం ఆమోదం పొందడం ఆదివాసీలకు చీకటి రోజు అని, ఆర్ఓఆర్ చట్టం బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సిమూర్తి అన్నారు. మండల కేంద్రంలో జీఎస్పీ ఆధ్వర్యంలో పూనెం సాయి చేపట్టిన మూడో రోజు దీక్షకు నర్సింహమూర్తి సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆర్ఓఆర్ బిల్లు గిరిజనుల అస్తిత్వాన్ని బొందపెట్టే విధంగా ఉందన్నారు. 2020లో కేసీఆర్ తెచ్చిన భూ చట్టాన్ని షెడ్యూల్ ఏరియాలో యథాతథంగా కొన సాగిస్తున్నారన్నారు. ఎల్‌టీఆర్ చట్టాన్ని ఉల్లంఘించి గిరిజనేతరులకు ఇచ్చిన భూమి హక్కుల కొన సాగింపుగా రైట్స్ ఆఫ్ రికార్డ్స్ చట్టం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులందరూ కాంగ్రెస్ పక్షాన నిల బడ్డారని గుర్తు చేశారు. నూతన భూ చట్టంలో గ్రామ కంఠం, అక్రమంగా గిరిజనేతరుల సాగులో ఉన్న భూములకు హక్కులు కల్పించడం ద్వారా గిరిజనులను నయవంచన చేశారని అన్నారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూ మిపై కుట్ర చేసి ఆడవాళ్లపై పాశవికంగా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహేష్, రవి పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వాడకంపై దాడులు

మంగపేట: మండలంలోని కొందరు కేబుల్ నెట్‌వర్క్ నిర్వాహకులు కొంత కాలంగా కేబులల్ టీవీ ప్రసారాలు చేసేందుకు ఎల్‌టీ లైన్ నుంచి అక్రమంగా విద్యుత్ వాడుతూ చౌర్యానికి పాల్పడుతున్నారనే సమాచారం మేరకు విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించినట్లు సమాచారం. కమలాపురంతో పాటు మండల వ్యాప్తంగా కేబుల్ టీవీ ప్రసారాలు చేస్తున్న నిర్వాహకులు విద్యుత్ స్తంభాల ద్వారా కేబుల్ వైర్లను అమర్చి సిగ్నల్స్‌ను పంపించేందుకు అవసరమైన చోట నోడ్స్, ఆంప్లీఫైర్స్, పవర్‌పాస్ యూనిట్లకు ఎల్‌టీ లైన్ నుంచి అక్రమంగా విద్యుత్‌ను వాడుతూ వ్యాపారం చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించేందుకు వచ్చినట్లు సమాచారం. కమలాపురంలో అక్రమంగా 40 చోట్లకు పైగా అక్రమంగా విద్యుత్‌ను వాడుతున్నట్లు గుర్తించిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్వాహకులతో కలిసి మంతనాలు జరిపిన ఎలాంటి దాడులు చేయకుండా వెళ్లినట్లు తెలిసింది. పూరిగుడిసెల్లో కరెంటు బిల్లు వాడే నిరుపేదపై కేసులు పెట్టే ఎన్పీడీసీఎల్ అధికారులు విద్యుత్తు చౌర్యానికి పాల్పడే కేబుల్ ఆపరేటర్లపై చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఏఈ సుబ్బరామశర్మను వివరణ అడుగగా కమలాపురంలోని జియో కేబుల్ నెట్‌వర్క్ 3477 సర్వీస్ నంబర్‌పై రూ. 4.60 లక్షల బకాయి ఉండటంతో వసూలు చేసేందుకు వచ్చామని నిర్వాహకులు బకాయి చెల్లించేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరడంతో నాలుగు రోజుల సమయం ఇచ్చామన్నారు. గ్రామంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు ఫిర్యాదు రావడంతో డీపీఈ వింగ్ విజిలెన్స్ అధికారులు గ్రామంలో దాడులు నిర్వహించి అక్రమంగా చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించామని అవి ఏ కేబుల్ వ్యాపారివనేది విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రెయినేజీ నీళ్లు కాలనీలోకి రాకుండా చూడాలి



డ్రెయినేజీ నిర్మాణ పనులను అడ్డుకుంటున్న కృష్ణకాలనీ వాసులు

- పనులను అడ్డుకున్న కాలనీవాసులు
- చర్యలు తీసుకోవాలని వినతి

ములుగు : వర్షాకాలంలో వచ్చే వరదల సమయంలో డ్రెయినేజీ నీళ్లు కాలనీలోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లాకేంద్రంలోని కృష్ణకాలనీ వాసులు అధికారులను కోరారు. ములుగు ప్రధాన రహదారి నుంచి బండారుపలి క్రాస్‌రోడ్డు నుంచి జీవంతరావుపల్లి క్రాస్ రోడ్డు వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇరువైపుల చేపడుతున్న మూడు ఫీట్ల సైడ్ డ్రెయినేజీ పనులను కాలనీ వాసులు బుధవారం అడ్డుకున్నారు. ప్రస్తుతం చేపడుతున్న డ్రెయినేజీని గతంలో ఉన్న ఒక ఫీట్ డ్రెయినేజీకి లింకు కలపడం ద్వారా భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అన్నారు. గతంలో భారీ వర్షాలు కురిసిన సమయంలో వర్షపు నీరు ఇళ్లముందుకు చేరి తీవ్ర ఇబ్బందులు పడ్డామని గుర్తు చేశారు. డ్రెయినేజీ నీరు నేషనల్ హైవేకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు సుధాకర్, మోహన్, నవీన్, రమేష్, దయాకర్, నరేష్, రాజిరెడ్డి, సంపత్, సత్యనారాయణ, కృష్ణకుమార్, పాల్గొన్నారు.

రహదారి పనులు చేపట్టాలని రాస్తారోకో



వెంకటాపురం(కె): రహదారి మరమ్మతు పనులను వెంటనే చేయాలని కోరుతూ మండలంలోని కొండాపురం రహదారిపై గ్రామస్తులు, రైతులు రాస్తారోకో చేశారు. రహదారి మరమ్మతుల కోసం తవ్విన కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయకపోవడంతో దుమ్మురేచి ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. లేచిన దుమ్ము పంట చేలపై పడి తెగుళ్ల బారిన పడుతున్నట్లు వాపోయారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సుమారు గంట పాటు వెంకటాపురం(కె), భద్రాచలం రహదారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ మల్లయ్య అక్కడికి వెళ్లి వారికి నచ్చ జెప్పడంతో రాస్తారోకోను విరమించారు. ఆ తరువాత వెంకటాపురం(కె) ఎస్సై తిరుపతిరావు ట్యాంకర్ ద్వారా దుమ్ము లేస్తున్న చోట రహదారిపై నీటిని చల్లించారు.

డీఎంహెచ్ఓ సేవలు మరువలేనవి

- వైద్యాశాఖాధికారులు



బదిలీపై వెళ్లిన డీఎంహెచ్ఓ, ప్రస్తుత డీఎంహెచ్ఓను సన్మానిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు

ములుగు : జిల్లాలోని మారుమూల ఏజెన్సీ గ్రామాల వాసులకు హనుమకొండ జిల్లాకు బదిలీపై వెళ్లిన డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య గత 8 ఏళ్ల పాటు గొప్ప సేవలు అందించారని వైద్యారోగ్యశాఖ అధికారులు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఏటూరునాగారం ఏజెన్సీలో వర్షాకాలంలో వాగులు వంకలు దాటుకుంటూ గిరిజనులకు వైద్యం అందించడం మరువలేనిదని అన్నారు. ఈ క్రమంలో గవర్నర్ ద్వారా ప్రశంసలు అందుకున్నారని గుర్తు చేశారు. గిరిజన, గొత్తికోయ గూడేల వాసులకు వైద్యం అందించాలనే లక్ష్యంతో ఎస్ఎస్ తాడ్వాయి, వాజేడు మండలాల్లో కంటైనర్ ఆస్పత్రుల ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు. ఆశా కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో సమన్వయంగా మెలిగారని అన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది అప్పయ్యతో పాటు నూతన డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్‌రావును గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ చంద్రకాంత్, సంపత్, దుర్గారావు, పూర్ణసంపత్‌రావు, గణేశ్, కిరణ్, సతీశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్లతో అదనపు ఆదాయం

- జిల్లా పశువైద్యాధికారి కొమరయ్య



దాణా, నీటి తొట్టెలు అందజేస్తున్న అధికారులు

వాజేడు: పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం పొంద వచ్చని ములుగు జిల్లా పశు వైద్యాధికారి కొమరయ్య, ఆఫీసర్ ఇన్‌చార్జ్ హెడ్ డాక్టర్ అమరేశ్వరి అన్నారు. మండల పరిధిలోని చీకుపల్లి, పెద్ద గొళ్లగూడెం గ్రామాల్లో బుధవారం పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పశుపరిశోధన క్షేత్రం మామునూరు ఆధ్వర్యంలో కోడి పిల్లలను పంపిణీ చేశారు. 95 ఎస్‌టీ లబ్ధిదారులకు ఆరు వారాల వయస్సు కలిగిన 2300 కోడి పిల్లలను, దాణా, నీటి తొట్టెలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోళ్ల పంపిణీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్యులు నర్సింహారావు, శ్రీనిధి, శాస్త్రవేత్త ప్రశాంత అకుమార్ పాల్గొన్నారు.

వాహనం బోల్తా.. ఇద్దరికి గాయాలు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక శివారులో బుధవారం రాత్రి టాటాఏస్ వాహనం బోల్తా పడడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని అందుకుతండాకు చెందిన భూక్యా సతీష్, దామరశెట్టి వీరయ్యలతో పాటు మరో ఇద్దరు రాంనర్సయ్య, లింగమూర్తిలు పరకాలకు వారి వ్యక్తిగత పనినిమిత్తం వెళ్లి తిరుగు వస్తున్న క్రమంలో నైన్‌పాక శివారులోని మలుపు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే 108కు సమాచారం అందించారు. అనంతరం 108 వాహన సిబ్బంది క్షతగాత్రులను చిట్యాల ఆసుపత్రికి తరలించారు.

ఇసుక క్వారీల నిర్వహణకు గ్రామసభలు



సభను ఉద్దేశించి మాట్లాడుతున్న అధికారులు



చేతులెత్తి మద్దతు తెలుపుతున్న ప్రజలు

వాజేడు: మండలంలోని టేకులగూడెం, చెరుకూరు ఇసుక క్వారీల నిర్వహణ కోసం బుధవారం ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ముందుగా టేకులగూడెం సభను నిర్వహించగా అక్కడి ప్రజలు సభకు మద్దతు తెలిపారు. 200 మంది వరకు హాజరు కాగా అందరూ చేతులెత్తి తమ మద్దతు ప్రకటించారు. కోరం సరే అనడతో గ్రామ సభ ఓకే అయినట్లు అధికారులు ప్రకటించి సంతకాలు తీసుకున్నారు. అనంతరం చెరుకూరు ఇసుక క్వారీ కోసం గ్రామసభను ఏర్పాటు చేశారు. సభకు తక్కువ మంది ప్రజలు హాజరుకావడంతో కోరం సరిపోలేదు. దీంతో గ్రామ సభను వాయిదా వేసి గురువారం ఉదయం 9 గంటలకు తిరిగి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ, ఎంపీఓలు తెలిపారు.

స్పందించేంత వరకు సమ్మె కొనసాగిస్తాం



సమ్మెలో కూర్చున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ములుగు: ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కోయల జీవనప్రియ అన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ సమీపంలో నిర్వహిస్తున్న తొమ్మిదో రోజు సమ్మెలో భాగంగా ఖమ్మం జిల్లాకు చెందిన డేటా ఎంట్రీ ఆపరేటర్ హైమావతి చిత్రపటానికి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్, సీపీఎం ములుగు మండల కార్యదర్శి ఎండీ.గఫూర్, పట్టణ కార్యదర్శి సద్దాం మద్దతుగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్లతో కూడిన అంశాన్ని తీర్మానం చేసి ప్రత్యేక జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి కుమార్ పాడ్య, ఉపాధ్యక్షులు ఎండీ ఫిరోజ్, విష్ణు, పాల్గొన్నారు.

ఐలాపూర్ జాతరకు నిధులివ్వాలి



తల్లులను దర్శించుకున్న తుడుందెబ్బ నాయకులు

కన్నాయిగూడెం: మండలంలోని ఐలా పూర్‌లో జరిగే సమ్మక్క సారలమ్మ జా తరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ పొడెం బాబు అన్నారు. బుధవారం సమ్మక్క సారలమ్మ తల్లులను ఆయన దర్శించుకున్నారు. అనంతరం రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షుడు కొప్పుల రవి మాట్లాడుతూ జాతరకు కావలసిన ఏర్పాట్లను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడారం డైరెక్టర్ పొడెం శోభన్, మండల అధ్యక్షుడు గండ్ల పాపారావు, పూజారి కోరం సంపత్, దేవర బాల లక్ష్మయ్య, సదన్‌రావు తదితరులు పాల్గొన్నారు